క్లుప్తంగా

ఇళ్ల స్థలాల పంపిణీ



ఇంటి స్థల పత్రం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: ప్రతి పేదవానికి సొంతిల్లు ఉండాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల సాకారమైందని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరులో 115 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఎంజాయిమెంట్‌ను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు ఉన్నారు.

గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

పెదపాడు : స్థానిక సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంలో ఇండేన్ గ్యాస్ ఉచిత కనెక్షన్లు 350 పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు కర్రె మరియమ్మ, మారుమూడి కృపామణి, సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహం ఆవిష్కరణ



దాతలు సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు చేసిన దాతలు అభినందనీయులని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సంపంగి వెంకటలక్ష్మి, హెచ్ఎం పాకలపాటి శ్రీదేవి, రమేష్ సహకారంతో ఏర్పాటుచేసిన సరస్వతిదేవి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉపాధ్యాయులు దాతలను సత్కరించారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు

గణపవరం: స్థానిక సద్గురు త్యాగరాజస్వామి 36వ సంగీత ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి త్యాగరాజ కళాక్షేత్రంలో మృదంగ వాద్య కచేరి నిర్వహించారు. బ్రహ్మశ్రీ హోతా కనక సీతారామచంద్రమూర్తి, పర్వతవర్ధనిల జ్ఞాపకార్థం వారి కుమారులు హోతా పెద పిచ్చయ్య, సూర్యనారాయణ సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్టు త్యాగరాజ కళాక్షేత్రం వ్యవస్థాపకుడు మాదేటి సురేష్ కుమార్ శ్రేష్ఠి తెలిపారు. గాత్రం, మృదంగం కల్లూరి శ్రీనివాస్, వయొలిన్ సరస్వతుల పార్థివ, ఘటం సరస్వతుల హనుమంతరావు అందించారు. నిత్యం ఉదయం గ్రామంలో నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం త్యాగరాజ కళాక్షేత్రంలో గాత్ర కచేరీలు, సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు మరమ్మతులు చేయించాలి

దెందులూరు: చింతలపూడి నియోజకవర్గం దేవులపల్లి నుంచి ఉంగుటూరు నియోజకవర్గం చేబ్రోలు వరకు రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని ఎంపీ కోటగిరి శ్రీధర్ కోరారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ వెంకట మోహనరెడ్డి, గోలి ప్రసాద్‌రెడ్డి, చింతలపూడి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ పాపారావు ఎంపీని కలిశారు. చేబ్రోలు – దేవులపల్లి మధ్య రోడ్డు, పరిస్థితి, ప్రయాణికుల ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీ ఆర్‌అండ్‌బీ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే మరమ్మతు పనులు చేయాలని సూచించారు. ఇప్పటికే రోడ్డు మరమ్మతు పనులకు చర్యలు ప్రారంభించినట్టు ఆయన చెప్పారు.

అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

పెదపాడు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని పెదపాడు సొసైటీలో అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో 25 మంది అభిమానులు రక్తదానం చేశారు. ఉమ్మడి జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ సీఎం జగన్ పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యనారాయణ, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సాబ్జీ ఆశయాలను సాధిద్దాం

గణపవరం: ఉద్యమాలే ఊపిరిగా తుదిశ్వాస విడిచేవరకు ఉద్యమించిన ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గోపీమూర్తి అన్నారు. శుక్రవారం యూటీఎఫ్ గణపవరం మండల కమిటీ ఆధ్వర్యంలో గణపవరం మండలం పిప్పరలో ఏర్పాటుచేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల ప్రకాష్, ఎంఈఓ పుచ్చల శేషు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద పాదయాత్రకు నీరాజనం

అడుగడుగునా ఘన స్వాగతం



దెందులూరులో పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



దెందులూరులో దళితవీధి గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత కస్సే శ్రీను, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం, భద్రత, భవిష్యత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరులో ప్రజా ఆశీర్వాద పాదయాత్ర నిర్వహించారు. దెందులూరు పెదదళితవాడలో సచివాలయాన్ని వైఎస్సార్ సీపీ నేత కస్సే శ్రీను, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభోత్సవం చేశారు. హెల్త్ సెంటర్, రైతుభరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. వాటర్ ట్యాంక్ వద్ద పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ, సీఎం జగన్ చేసిన పాలన వల్ల పార్టీ ఆవిర్భావం నుంచి అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో విజయం సాధించేది వైఎస్సార్ సీపీనేనని తెలిపారు. పథకాల అమలు తీరు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను ప్రతిపక్షం ఓర్వలేకపోతోందని అన్నారు. మోసపూరిత వాగ్దానాలకు తెరలేపిందని విమర్శించారు. అన్ని రంగాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, క్షేత్ర స్థాయిలో అమలు చేసి చూపించిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కుటుంబమంతా సమష్టిగా కృషి చేసి మరింత విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు. పాదయాత్రకు గ్రామగ్రామాన, వీధివీధిన రోడ్డుకిరువైపులా యువత, మహిళలు ఉత్సాహంగా పూలవర్షం కురిపిస్తూ, బాణసంచా కాల్చుతూ ఆహ్వానం పలుకుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాదయాత్రకు వస్తున్న జనాన్ని చూసి పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీటీసీలు తాళ్లూరి నాగరాజు, తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, పార్టీ నాయకులు సంపంగి వేణుగోపాల్ తిలక్, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్ ఉన్నారు.

కైకరం షష్ఠిలో భక్తుల సందడి

ఉంగుటూరు: కైకరం సుబ్రహమణ్యషష్ఠికి భక్తులు పోటెత్తారు. ఐదో రోజు శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగమ్మతల్లిని దర్శించుకున్నారు. షష్ఠి తిరునాళ్లలో పాల్గొన్నారు. పగలు బుర్రకథ వినిపించారు. రాత్రి వైజాగ్ వారి సినీ సంగీత విభావరి వినిపించారు. తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు నాగమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు పుప్పాల గోపి, వీఆర్వో శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. ఎస్సై మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నేడు 'ఆడుదాం ఆంధ్ర' ర్యాలీ

ఉంగుటూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కోరుతూ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగారావు తెలిపారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దెందులూరులో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ శ్రీధర్



పెదపాడు సొసైటీలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాజశేఖర్

ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పుట్టిన రోజు వేడుకలో ఎంపీ శ్రీధర్

దెందులూరు: దెందులూరు గడ్డపై మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పుట్టినరోజు వేడుక వైభవంగా నిర్వహించారు. తొలుత కేక్‌ను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ అప్పన్న ప్రసాద్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తి, ఆశయాలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వచ్చే ఎన్నికల్లో విజయబావుట ఎగురవేయడం తథ్యమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు వచ్చే ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు ఇస్తాయన్నారు. తొలుత జెడ్పీచైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్ ఆధ్వర్యంలో దెందులూరు బస్టాండ్ సెంటరులో 300 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్‌కుమార్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు జానంపేట బాబు, కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, అప్పన్న ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవ కాంతం గంగరాజు, ఎంపీపీలు బత్తుల రత్నకుమారి, తాతా రమ్యశ్రీ, పెన్మెత్స శ్రీనివాసరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, విజయవాడ కనకదుర్గమ్మ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, నియోజకవర్గంలోని అధికారులు, పార్టీ శ్రేణులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

పాస్టర్లకు దుస్తుల పంపిణీ

పెదపాడు : ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక కోఆపరేటివ్ సొసైటీలో పాస్టర్లుకు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం రాజశేఖర్ అందించిన పాస్టర్లుకు ప్యాంటు షర్ట్, మహిళలకు చీరలను ఎంపీపీ బత్తుల రత్నకుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపిచంద్ర దుర్గాప్రసాద్, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవి కుమార్ కర్రె మరియమ్మ, మారుమూడి కృపామణి, సర్పంచ్ సిద్ధాబత్తిన జోజమ్మ, స్థానిక నాయకులు కొత్తూరు విమలారావు, బత్తుల ఏసురాజు, కాలి మిరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రూ.2 వేల కోట్ల అభివృద్ధి

- పారదర్శకంగా పథకాల అమలు
- ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో రెండు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో వాసుబాబు తన మనోగతాన్ని 'సాక్షి' వద్ద వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మధ్యవర్తిత్వం లేని ప్రభుత్వం సృష్టించిన నూతన (ఒరవడి) విధానాన్ని ప్రజలు ఆశీర్వదిస్తారు. అవినీతికి తావు లేకుండా కుల మతాలకు, వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. వాలంటీరు, సచివాలయ వ్యవస్థతో పాలనను ప్రజల వద్దకు చేర్చాం. నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో 8,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. 6,000 ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. సచివాలయాలు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు, నాడు - నేడులో పాఠశాల భవనాల నిర్మాణంలో గ్రామాలు కొత్తరూపును సంతరించుకున్నాయి. కరోనా వైరస్ విజృంభించిన సమయంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేశాం. టీడీపీ హయాంలో ధనార్జనే తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకున్నది లేదు. అర్హత ఉన్నా ప్రజలు జన్మభూమి కమిటీ సభ్యులు (టీడీపీ కార్యకర్తలు) అనుమతిస్తేగాని పథకాలు పొందలేని పరిస్థితిని చేశాం. ఆవిధానానికి సీఎం జగన్ స్వస్తి పలికి లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా లబ్ధిని జమచేసే విధానాన్ని తీసుకొచ్చారు. ఈ విధానంతోనే వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి వారి మద్దతు కోరుతున్నాం. ప్రజలంతా మా వైపే. వారి ఆశీర్వాదాలు మా పార్టీపైనే ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడపగడపకూ వెళ్లినప్పుడు ప్రజలు స్వాగతిస్తున్నారు. పథకాలు, అభివృద్ధిని చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపే నా గెలుపు'. అని వాసుబాబు ధీమా వ్యక్తం చేశారు.

ముక్కోటి ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



సీతారాములకు చామంతి పూజ చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఉంగుటూరు: గోపినాథపట్నం భక్తాంజనేయ స్వామి ముక్కోటి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవాలు శుక్రవారం శ్రీరామచంద్రస్వామికి లక్ష చామంతులతో పూజ, వెంకటేశ్వరస్వామికి లక్ష తులసీ దళాలతో సహస్ర నామాలతో పూజ చేశారు. అమ్మవారికి కుంకమార్చన నిర్వహించారు. దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ సొదినికుమారి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కోడిగూడెం భక్త సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. 23 వైకుంఠ ఏకాదశి ముక్కోటి కావడంతో ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులకు అనుమతిస్తారు.

శ్రీనివాస రామానుజన్ సేవలు అజరామరం



భీమడోలు : పూళ్లలో నెంబర్ 1729లో ఒదిగిన విద్యార్థులు



గణపవరం : జల్లికొమ్మర యూపీ స్కూల్లో రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

భీమడోలు: ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ సేవలు మరవలేనివని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం రామానుజన్ 136వ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలు మాసన ఇంగ్లిషు మీడియం పాఠశాలలో ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు గణితానికి సంబంధించి 400 ప్రాజెక్టులను తయారీ చేసి అబ్బురపర్చారు. గణితంపై రాసిన పాటకు బాలికలు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. పూళ్ల హైస్కూల్లో హెచ్ఎం పెనుగొండ భువనేశ్వరరావు ఆధ్వర్యంలో రామానుజన్ మ్యాజిక్ నంబర్ 1729 చిహ్నంగా చిన్నారులంతా కూర్చుని ఆకట్టుకున్నారు. వివిధ గణితంలో గణిత వ్యాసరచన, రంగవల్లులు, గణిత క్విజ్ పోటీల్లో విజేతలైన పి.లక్ష్మీగాయత్రి, సౌజన్య, గణేష్, బాలు, గణేష్‌లకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు కె.వెంకటేష్, ఎం.కనకరావు, లీలా అపరంజిని పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

గణపవరం: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణపవరం మండలం జల్లికొమ్మర యూపీ స్కూల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత ముగ్గుల పోటీలు, వకృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత అంశాల మోడల్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. రామానుజన్ జీవిత విశేషాలు, గణితం గొప్పదనంపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్ఎం సుందరకుమార్, టీచర్స్ పి.సౌజన్య, ఎల్ ప్రసాదరావు తదితరులున్నారు.

నారాయణపురం డిగ్రీ కాలేజీలో..

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమం వైస్ ప్రిన్సిపాల్ డి.రెడ్డయ్య అధ్యక్షతన నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రెడ్డయ్య, అకడమిక్ కోఆర్డినేటర్ కొండ రవి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పుట్టా బాబురావు, బీవీ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. అభిరుచి, ఆసక్తి ఉంటే ఆకాశమే హద్దుగా ఎదిగే అవకాశం శ్రీనివాస రామానుజన్ జీవితం ద్వారా తెలుసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. తాడేపల్లిగూడెంలో ఆంధ్రప్రదేశ్ నిట్ గణిత శాస్త్ర ఆచార్యులు, డీన్ అకడమిక్ అఫైర్స్ తమ్మినాన్న కూర్మయ్య ముఖ్య వక్తగా విచ్చేసి హౌ టు ప్రూవ్ ద మ్యాథమెటికల్ స్టేట్‌మెంట్స్ అనే అంశంపై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు గణిత సిద్ధాంతాలపై రూపొందించిన నమూనాలను, సమస్యలను సులువుగా పరిష్కరించగలిగే మోడల్స్ దర్శించి అభినందించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందించారు. ఎకనామిక్స్ లెక్చరర్ నిర్మల జ్యోతి, హిస్టరీ లెక్చరర్ కృష్ణ జ్యోతి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

పెదవేగి : పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ గుమ్మడిగుంటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గొటుకుల పార్థసారథి కుటుంబానికి ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ అవినాష్ రాజ్, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్ 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శేషకుమార్, మల్లికార్జునరావు, నాగభూషణం, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

కొండె వినయ్ కుమార్ S/o దాసు నాకు నా గ్రామంలో అనగా ముప్పర్రు గ్రామం పెదపాడు మండలం ఏలూరు జిల్లా, డోర్. నెం. 2-93, నాకు గల లింక్ డాక్యుమెంట్ నెం: 1630/1993 ఒరిజినల్ డాక్యుమెంట్ పెదపాడు మండలం నుండి దెందులూరు మోటార్ వెహికల్ మీద వెళ్ళుచుండగా మార్గమధ్యలో బ్యాగు పడిపోయినది దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కి తెలియజేయగలరు

22-12-2023 కొండె వినయ్ కుమార్
ముప్పర్రు 8074270738

శ్రీరాముని అక్షింతల పంపిణీ



నిడమర్రు : అడవికొలనులో అయోధ్య అక్షింతలను అందజేస్తున్న దృశ్యం



ఉంగుటూరు : అక్షింతలను ఆలయం వద్ద ఊరేగిస్తున్న భక్తులు

నిడమర్రు: భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతోన్న నేపథ్యంలో భగవాన్ రామ్‌లల్లా విరాజ్‌మాన్‌ను పూజించిన అక్షింతలను అడవికొలను గ్రామం నుంచి శుక్రవారం మండలంలోని 15 గ్రామాలకు పంపిణీ చేశారు. గత నెల 22న గ్రామానికి చేరిన ఈ అక్షింతలను పర్వత ఆంజనేయుని సన్నిధిలో భద్రపరిచారు. వివిధ పూజలు చేశారు. విశ్వహిందూ పరిషత్ సభ్యుడు పాపోలు సూర్యారావు అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. వచ్చే జనవరి 22న అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేసే నేపథ్యంలో మండలంలో ఈ అక్షింతలనే ఆహ్వానంగా భక్తులకు అందిస్తున్నట్టు నిమ్మల జయప్రకాష్ నారాయణ తెలిపారు. సీహెచ్ జయరాజు, నిమ్మల దొరబాబు తదితరులున్నారు.

అక్షింతల పూరేగింపు

ఉంగుటూరు: అయోధ్య తలంబ్రాలను గ్రామంలో ఊరేగించారు. రామాలయాలు, అమ్మవారి ఆలయాలకు తలంబ్రాలను తీసుకెళ్లారు. కొరిపల్లి అప్పారావు, పిల్లా రామకృష్ణ దంపతులు, అడపా శోభారాణి దంపతులు పాల్గొన్నారు

ఇష్టంగా చదివితే ఉన్నత స్థానాలు



విద్యార్థులను బహుమతులతో సత్కరిస్తున్న రాధా పుష్పావతి, తదితరులు

భీమడోలు: ఇష్టంగా చదవివతే ఉన్నతంగా ఎదుగుతారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ జిల్లా చైర్‌పర్సన్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాధా పుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులకు తొలి మెట్టు పదో తరగతి అని, మంచిగా చదువుకుని తన బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. మానవత సంస్థ ప్రతిభ గల విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని, సివిల్ సర్వీసులు చదువుకునే వారికి ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకోవాలని, వ్యాసనాలకు దూరంగా ఉండాలని, మనోధైర్యంతో మెలగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి తెలుగు, ఇంగ్లిషు మీడియంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన ఆరుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు, గ్రామర్ బుక్స్, పతకాలు, జ్ఞాపికలను అందించారు. హెచ్ఎం శ్రీనివాసరావును సన్మానించారు. జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైకుంఠనాథుని దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

భీమడోలు: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు మండలంలోని వైష్ణవాలయాలు సర్వంగా సుందరంగా ముస్తాబయ్యాయి. ఉత్తర ద్వారంలో వైకుంఠనాథుడిని భక్తులు దర్శించుకునేందుకు ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లోని కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి, శ్రీసీతారామస్వామి వారి ఆలయాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఉత్తమ ద్వారంలో కొలువై ఉన్న వైకుంఠనాథుని భక్తులు దర్శించుకోనున్నారు. భీమడోలులోని వేంకటేశ్వర, ఆంజనేయస్వామి ఆలయాన్ని ఉత్సవ కమిటీ నిర్వాహకులు సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ స్తంభం మార్పుపై హర్షం

పెదవేగి : మండలంలోని విజయరాయి మండల ప్రాథమిక పాఠశాల వద్ద పురాతన ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని ఎంఈఓ అరుణ్ కుమార్ విద్యుత్ ఏడీ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఏఈడీ 12 గంటల వ్యవధిలోనే కొత్తం స్తంభం ఏర్పాటు చేయించి పరిష్కరించారు.